
www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 2 జూలై 2025
5
పశ్చిమ గోదావరి



నేటి నుంచి అల్లూరి జయంతోత్సవాలు

భీమవరం టౌన్:భీమవరంలో ఈ నెల 2, 3, 4 తేదీల్లో శ్రీవిజ్ఞాన వేదిక, అల్లూరి సీతారామరాజు యువజన సంఘాల జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అల్లూరి సీతారామరాజు యువజన సంఘాల జిల్లా సమాఖ్య అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి తెలిపారు. మంగళవారం హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీప్రభాతి వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. 2న క్విట్ ఇండియా స్పూర్తి వద్ద జయంతోత్సవాలు ప్రారంభిస్తామని, 2, 3 తేదీల్లో అన్ని విగ్రహాలకు నివాళులు, విద్యార్థులకు పోటీలు, 4న ప్రధాని ఆవిష్కరించిన అల్లూరి సీతారామరాజు కాంస్య విగ్రహం వద్ద ముగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. మూడు రోజులపాటు పట్టణంలో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరుతున్నామన్నారు. జనసేన నాయకులు వబిలిశెట్టి రామకృష్ణ, మందిర కార్యదర్శి కుక్కల బాల, జనసాటి మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

రైతుకేదీ భరోసా..!



రెండు జిల్లాల్లో రబీ ధాన్యం బకాయిలు రూ.186 కోట్లు

వైరస్, ధరల పతనంతో ఆక్వా రైతులు విలవిల

అయినకాడికి అమ్ముకున్న కోకో రైతులు

మామిడి రైతుల పరిస్థితి మరింత దారుణం

రైతులకు ఉచిత పంటల బీమా సైతం ఎత్తివేత

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అన్నదాతకు భరోసా లేకుండాపోయింది. రైతులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోంది. 'చేతులు కాలాక ఆకులు పట్టుకున్న' చందంగా రైతులు తీవ్ర నష్టాలు చవిచూసిన తర్వాత ప్రభుత్వం తూతూమంత్రపు చర్యలతో సరిపెడుతోంది. దీంతో ప్రభుత్వంపై రైతన్నల్లో తీవ్ర అసంతృప్తి పెల్లుబుకుతోంది. గడిచిన రబీలో రెండు జిల్లాల్లో దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. రబీలో సేకరించిన ధాన్యానికి తొలుత 48 గంటల్లోపే ధాన్యం సొమ్ము జమ చేసిన ప్రభుత్వం, ఆ తర్వాత చేతులెత్తేసింది. ఆఖరులో కొనుగోలు చేసిన ధాన్యం సొమ్ము ఇప్పటికీ జమ కాలేదు. పశ్చిమగోదావరి జిల్లాలో మంగళవారం రూ.112 కోట్లు జమైనట్లు చెబుతున్నప్పటికీ ఇంకా రూ.150 కోట్లకుపైగా ధాన్యం బకాయి ఉంది. ఏలూరు జిల్లాలో రూ.36 కోట్లు మొత్తం రెండు జిల్లాల్లో రూ.186 కోట్లకుపైగా ధాన్యం సొమ్ము జమకాని పరిస్థితి ఉంది. అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టిన రైతులకు ధాన్యం సొమ్ము సకాలంలో అందకపోవడంతో తీవ్రంగా నలిగిపోతున్నారు. ధాన్యం సొమ్ము కోసం వేలాది మంది రైతులు కళ్లుకాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. రైతుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తుందనే చర్చ సాగుతోంది. జిల్లాలో మరో అతిపెద్ద సాగు ఆక్వా. రెండు జిల్లాల్లో దాదాపు రెండు లక్షల ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నారు. వాతావరణ మార్పులతో విబ్రో వైరస్ సోకి రొయ్యల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రస్తుత దశలో సాగు చేసిన రొయ్యల్లో 90 శాతానికిపైగా దెబ్బతిన్నట్లు ఆక్వా రైతులు ఘొల్లుమంటున్నారు. మేత, డీజిల్, పెట్రోల్ ధరలు వంటివి విపరీతంగా పెరిగినప్పటికీ వంద కౌంట్ ధర రూ.220 పలకడమే గగనంగా మారింది. దీంతో ఎంత శ్రమించినా ఆక్వా రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోవడం లేదు.

అయినకాడికి అమ్ముకున్న కోకో రైతులు

ఈ ఏడాది జిల్లాలో కోకో రైతులు తీవ్రంగా నష్టపోయారు. రాష్ట్రంలో అత్యధికంగా ఏలూరు జిల్లాలో దాదాపు 40 వేల ఎకరాల్లో కోకో రైతులు సాగు చేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ధర కిలో రూ.800 ఉన్నప్పటికీ వ్యాపారులు మాత్రం కిలో రూ.400కు మించి కొనుగోలు చేయలేదు. దీనిపై కోకో రైతులు అలుపెరగని పోరాటం చేశారు. ప్రభుత్వం ఆలస్యంగా స్పందించడంతో రైతులకు మేలు జరగకుండాపోయింది. అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కోకో పంటను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోలేదు. కంపెనీలు కిలోకు రూ.450 ఇస్తే ప్రభుత్వం రూ.50 ఇచ్చి రూ.500కు కొనుగోలు చేస్తామని చెప్పి తప్పించుకుంది. ప్రభుత్వం ప్రకటించిన ధర రూ.500 సైతం చాలామంది రైతులకు అందలేదు. ప్రభుత్వం ధర నిర్ణయించిన తర్వాత సైతం కిలో రూ.400కే కొనుగోలు చేశారంటే అతిశయోక్తి కాదు. జూన్ నెలాఖరుతో ప్రభుత్వం ప్రకటించిన ధర గడువు ముగిసింది. రైతులు మరో రెండు వారాలపాటు పొడిగించాలని కోరుతున్నా పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడు. జిల్లాలో 50 వేలకుపైగా ఎకరాల్లో మామిడి సాగవుతోంది. ధర పడిపోయి టన్ను రూ.13 వేల నుంచి రూ.ఏడు వేలు దిగువకు పడిపోయింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోకపోవడంతో నిర్లక్ష్యం ప్రదర్శించింది. రైతుల వద్ద మూడోవంతు పంట అయినకాడికి అమ్ముకున్న తర్వాత చర్యల పేరుతో హడావుడి చేస్తున్నారనే ఆవేదన రైతుల్లో నెలకొంది.

ఉచిత బీమా ఎత్తివేత

రైతులకు మేలు చేసే పథకం ఉచిత పంటల బీమాను సైతం ప్రభుత్వం ఎత్తివేసింది. ఖరీఫ్‌లో ప్రతియేటా తుపాన్లు, వరదలు విరుచుకుపడతాయి. దీంతో వరి రైతులు పంటను కోల్పోతున్నారు. వరి రైతులకు బీమా అత్యంత అవసరం. పంటల బీమా ప్రీమియంను ప్రభుత్వమే చెల్లించేది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉచిత పంటల బీమా పథకాన్ని ఎత్తివేసింది. దీంతో బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతుల నుంచి బీమా ప్రీమియంను బ్యాంకర్లు మినహాయించుకుంటున్నారు. రైతులకు ఇచ్చే ఉచిత బీమాను సైతం ఎత్తివేయడంపై తీవ్రంగా చర్చ సాగుతోంది.

బ్యాంకు పిఒ నుంచి... పోలీసు బాస్‌గా..!

కేరళ డిజిపి రావాడ ఆజాద్ చంద్రశేఖర్ ఉద్యోగ ప్రస్థానం

ఉమ్మడి రాష్ట్రంలోనే విద్యాభ్యాసం


ఐపిఎస్‌గా తొలి పోస్టింగ్ కేరళలోనే



డిజిపిగా చంద్రశేఖర్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - వీరవాసరం

వ్యవసాయ కుటుంబంలో పుట్టిన రావాడ ఆజాద్ చంద్రశేఖర్ అంచెలంచెలుగా ఎదిగి నేడు డిజిపి స్థాయికి ఎదిగారు. వీరవాసరానికి చెందిన రావాడ వెంకట్రావు, రామమ్మ దంపతులకు నలుగురు సంతానం. ముగ్గురు ఆడపిల్లలు, ఆఖరివాడు రావాడ ఆజాద్ చంద్రశేఖర్. వీరిది వ్యవసాయ కుటుంబం. ఆజాద్ చంద్రశేఖర్ ఒకటో తరగతి నుండి 5వ తరగతి వరకూ వీరవాసరంలోని పోతుమర్తి కాన్వెంట్‌లో చదివారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకూ స్థానిక ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్లో, ఇంటర్మీడియట్ విజిని జూనియర్ కాలేజ్‌లో చదివారు. అగ్రికల్చర్ బిఎస్‌సి బాపట్ల కాలేజ్‌లో, హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో అగ్రికల్చర్ ఎంఎస్‌సి చేశారు. తరువాత పాడేరు నాబార్డ్ బ్యాంకులో పిఒగా మొట్టమొదట ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. అయితే ఇంకా ఉన్నత స్థానాలు అధిరోహించాలనే లక్ష్యంతో పట్టుదలతో చదివి 1991లో ఐపిఎస్‌కు ఎంపికయ్యారు. ఈ మేరకు కేరళ రాష్ట్రంలో పాల్‌క్కాడ్‌కు ఎఎస్‌పిగా బాధ్యతలు చేపట్టారు. తరువాత ఉద్యోగోన్నతిపై త్రివేండ్రంలో డిఐజిగా పని చేశారు. కేరళలో పలు కీలక బాధ్యతల్లో సమర్థవంతంగా వ్యవహరించి రాష్ట్రపతి నుంచి ఉత్తమ సేవల అవార్డును అందుకున్నారు. అక్కడ నుంచి డిప్యుటేషన్‌పై కేంద్ర సర్వీసుల్లోకి వెళ్లారు. సెంట్రల్ ఇంటెలిజెన్స్ బ్యూరో స్పెషల్ డైరెక్టర్ హోదాలో పని చేస్తున్న చంద్రశేఖర్‌ను ఇటీవలే సెంట్రల్ కేబినెట్ సెక్రటేరియట్ (స్పెషల్ సెక్రటరీ) కార్యదర్శిగా కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఇంకా ఆ బాధ్యతల్లో చేరక ముందే కేరళ ప్రభుత్వం చంద్రశేఖర్‌ను డిజిపిగా ప్రకటించింది. కేరళ ప్రస్తుత డిజిపి దర్వేష్ సాహెబ్ సోమవారం ఉద్యోగ విరమణ చేయడంతో ఆ రాష్ట్ర ప్రభుత్వం నూతన డిజిపిగా చంద్రశేఖర్‌ను నియమించింది. దీంతో వీరవాసరంలోని చంద్రశేఖర్ బంధుమిత్రులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. చంద్రశేఖర్‌కు భార్య సరిత, ఇద్దరు కుమారులు ఉన్నారు. చంద్రశేఖర్ వీరవాసరంలో తాను చదువుకున్న ఎంఆర్‌కె హైస్కూల్‌కు ఆర్థిక సాయం చేశారు. రామాలయ నిర్మాణానికి సుమారు రూ.10 లక్షలు అందజేశారు.



కుటుంబ సభ్యులతో ఆజాద్ చంద్రశేఖర్

విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, పింఛన్ల మంజూరులో ప్రభుత్వ జాప్యం సరికాదు : జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

ప్రజలపై భారాలు వేసే ప్రీపెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్లను వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం డిమాండ్ చేశారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సమావేశం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ స్మార్ట్ మీటర్లను పెట్టాలనుకున్న వైసిపి ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారని, నేడు కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని శరవేగంగా అమలు చేయడం సిగ్గుచేటు అని విమర్శించారు. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రయివేటు కంపెనీల్లో, సంస్థల్లో బిగించారని, ప్రజా ఆమోదం లేకుండా ప్రజల ఇళ్లకు కూడా బలవంతంగా బిగిస్తున్నారని తెలిపారు. ఈ స్మార్ట్ మీటర్లు అనేక విధాలుగా ప్రజలకు నష్టదాయకమన్నారు. ఒక్కో స్మార్ట్ మీటర్ సుమారు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకూ ఖరీదు ఉంటుందని, దాన్ని ప్రతి నెలా వచ్చే కరెంటు బిల్లులో ప్రజలపైనే భారంగా వేస్తారని చెప్పారు. టైమ్ ఆఫ్ ది డే పేరుతో కరెంటు వాడకాన్ని బట్టి కూడా ఛార్జి ఏ రోజుకారోజు విపరీతంగా పెరిగే అవకాశం ఉందన్నారు. సెల్‌ఫోన్లకు రీఛార్జి చేయించుకున్నట్లే కరెంటుకు కూడా రీఛార్జి చేయించుకోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. రీఛార్జి చేసుకోకపోతే కరెంట్ సరఫరా నిలిచిపోయే ప్రమాదం కూడా ఉందన్నారు. ఒక నెల కరెంట్ బిల్లు కట్టకపోతే రెండో నెలలో కట్టే సౌకర్యం నేడు ఉందని, స్మార్ట్ మీటర్లు పెడితే అలాంటి సౌకర్యం ఉండదని తెలిపారు. ప్రజలకు నష్టం చేకూర్చే ఇలాంటి స్మార్ట్ మీటర్ల బిగింపు నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లను బలవంతంగా పెట్టాలని చూస్తే ప్రజలందరూ ఐక్యంగా వాటిని పగలగొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజలందరూ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బలరాం

రైల్వే ఛార్జీల పెంపు అన్యాయం

కేంద్ర ప్రభుత్వం పెంచిన రైల్వే ఛార్జీలను వెంటనే వెనక్కి తీసుకోవాలని బలరాం డిమాండ్ చేశారు. ఇప్పటికే అధిక ధరలు, పెట్రోలు, డీజిల్, గ్యాస్, కరెంటు ఛార్జీలు వంటి భారాలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అవి తగ్గించకుండా మళ్లీ రైల్వే ఛార్జీలు పెంచడం సరికాదన్నారు. ఇప్పటికే దేశంలో సామాన్య ప్రజలు ప్రయాణించే జనరల్ బోగీలు తగ్గించేశారన్నారు. రైల్వే స్టేషన్లలో కనీస సౌకర్యాలు కల్పించకుండా, ప్రజల భద్రతను గాలికొదిలేసి మోడీ ప్రభుత్వం రైల్వే ఛార్జీలు పెంచడం అన్యాయమన్నారు. మారుమూల పల్లె ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు కల్పించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి గోపాలన్ మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదైనా కొత్త పెన్షన్ల మంజూరు హామీ నేటికీ అమలు చేయడంలో విఫలమైందన్నారు. గతం నుంచి కొనసాగే పింఛన్లు తప్ప కొత్తవి మంజూరు చేయలేదన్నారు.

వితంతువులుగా ఉన్నవారు పింఛన్లకు దరఖాస్తు చేసుకున్నా నేటికీ ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులందరికీ ఫించను ఇవ్వకుండా కాలయాపన చేయడం తగదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కొత్త పింఛన్ల మంజూరుకు ఆన్‌లైన్ సైట్లను విడుదల చేయాలన్నారు. ఒక పంట పూర్తయి మరో పంటకు వచ్చిన రైతులకు నేటికీ ధాన్యం బకాయిలు సుమారు రూ. 293 కోట్లు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. జిల్లాలో ఆకుమడులు, నాట్లు వేస్తున్నారని గానీ నేటికీ ధాన్యం బకాయిలు ఇవ్వకపోతే ఎలా వ్యవసాయం చేస్తారని ప్రశ్నించారు. తక్షణం రైతుల ధాన్యం బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు, బి.వాసుదేవరావు, చింతకాయల బాబూరావు, కర్రి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను అర్హులకు అందజేయాలి

కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రభుత్వం ద్వారా అందే లబ్ధిని అర్హులకు అందించడంలో ముందుండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మంగళవారం ఉదయం మండలంలోని ఆలమూరు గ్రామ సచివాలయం వద్ద వృద్ధులు, వితంతువులకు కలెక్టర్ లబ్ధిదారులకు పింఛన్లు అందజేసి, వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెలా ఈ కార్యక్రమం ప్రభుత్వ అధికారులూ చక్కటి వాతావరణంలో నిర్వహించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఆచంట ఎంఎల్‌ఎ తనయుడు పితాని వెంకట్, టిడిపి మండల అధ్యక్షులు వెలగల బుల్లి రామిరెడ్డి, పార్టీ క్లస్టర్ కన్వీనర్ కర్రి అచ్యుత రామారెడ్డి, తహశీల్దార్ వై.రావికుమార్, ఎంపిడిఒ ఎంఎస్.ప్రభాకరరావు, ఎంఇఒ ఉంగరాల నాగేశ్వరరావు, రెవెన్యూ, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.



వికలాంగునికి ట్రై సైకిల్, పింఛన్ అందజేస్తున్న కలెక్టర్

మెగా డిఎస్‌సికి 750 మంది హాజరు

భీమవరం :జిల్లాలో మూడు కేంద్రాల్లో నిర్వహించిన మెగా డిఎస్‌సి పరీక్ష మంగళవారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం సెషన్‌లో 385 మంది అభ్యర్థులకు గాను 372 మంది హాజరు కాగా 13 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 386 మందికి గాను 378 మంది హాజరు కాగా 8 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 771 మంది అభ్యర్థులకు గాను 750 మంది హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 97.28 శాతం హాజరు నమోదైంది. ఏవిధమైన మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖ అధికారి ఇవివిఎన్‌ఎస్‌ఎస్‌ఎస్‌బిఎల్.నారాయణ తెలిపారు.

9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ర్యాలీలు

ప్రజాశక్తి - కాళ్ల

జులై 9న దేశవ్యాప్త కార్మిక వర్గ సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు గొర్ల రామకృష్ణ, మండా సూరిబాబు కోరారు. కాళ్లలో సిఐటియు ఆధ్వర్యంలో మోటార్ సైకిల్ ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు గొర్ల రామకృష్ణ, మండా సూరిబాబు మాట్లాడుతూ లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులు ప్రాణ త్యాగాలతో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు, ఉద్యోగులు, రైతులు, కూలీలు, చేతి వృత్తిదారులు సమ్మెలో పాల్గొను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పశువులేటి సత్తిబాబు, పి.మధు, తానుకొండ వెంకటేశ్వరరావు, బాతు రామస్వామి, తులా వెంకటేశ్వరరావు, వెంకన్న బాబు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు, రైతులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో మంగళవారం సమ్మెకు సంబంధించి డోర్ స్టిక్కర్ ఆవిష్కరించారు. అనంతరం జవ్వాది శ్రీను అధ్యక్షతన లేబర్ కోడ్‌లపై స్టడీ సర్కిల్, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ ఉద్యోగ, కార్మికులకు చాలా నష్టం చేస్తాయన్నారు. లేబర్ కోడ్స్ అమలు ద్వారా కార్మికులు ఇప్పటి వరకు సాధించుకున్న హక్కులు మొత్తం కోల్పోతారన్నారు. జులై 9న జరిగే సమ్మెలో రాజకీయాలకు అతీతంగా కార్మికులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు జవ్వాది శ్రీను, కరెడ్ల రామకృష్ణ, సత్తి కోదండ రామిరెడ్డి, చల్లా చంద్రరావు, చిటికెన రాము, నరమాల కష్ణ, ఎర్రి నాయుడు, దేశంశెట్టి సతీష్, ఏపూరి శ్రీను, వి.శ్రీను, ఎం.సుబ్బారావు పాల్గొన్నారు.

ఆచంట : నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని జులై 9న జరగనున్న సార్వత్రిక సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కేతా నాగ ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఈ మేరకు సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులను యజమానులకు బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కాండ్రేగుల శ్రీహరి, కుడిపూడి గోపాలకృష్ణ, కడలి ధర్మరాజు, కుసుమే అశోక్‌కుమార్, కేతా వెంకటేశ్వరరావు, కె. కనకేశ్వరరావు పాల్గొన్నారు.



సమ్మెకు సంబంధించి డోర్ స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

తణుకు : కార్మిక చట్టాల పరిరక్షణకు ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వేల్పూరు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు బళ్ళ చిన వీరభద్రరావు కోరారు. వేల్పూరు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) సమావేశం యర్రా మల్లికార్జునరావు అధ్యక్షతన పార్వతీదేవి ఆలయ ప్రాంగణంలో జరిగింది. ఈ సమావేశంలో వీరభద్రరావు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 11 ఏళ్లుగా కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న దుర్మార్గమైన విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల తొమ్మిదవ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెలో భవన నిర్మాణ కార్మికులు సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. వాటాల నాగేశ్వరరావు, సోరపల్లి రామకృష్ణ, తిరునాదం వెంకటేశ్వరరావు, దున్నే నాగేశ్వరరావు, తాళ్ల సత్యనారాయణ, యాతం పెద్దిరాజు, ఆనందం గంగాధర్ పాల్గొన్నారు.

వీరవాసరం : కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఈనెల 9న జరగనున్న దేశ సమ్మెకు సహకరించాలని, స్వచ్ఛందంగా పాల్గొనాలని వీరవాసరంలో వివిధ సంస్థలకు, ఆఫీసులకు సమ్మె పత్రాలను అందజేశారు. సిఐటియు, రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ముత్తూట్ ఫైనాన్స్, ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఆటో, భవన నిర్మాణ కార్మిక సంఘాలకు సమ్మె పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికులు అనేక పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేస్తోందని, వాటి స్థానంలో లేబర్ కోడ్‌లు తీసుకొస్తోందని తెలిపారు. వీటివల్ల ఉద్యోగ కార్మికులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఈ మేరకు దేశవ్యాప్త సమ్మె చేయాలని నిర్ణయించాయని, అన్ని సంస్థలు సంఘాలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కొత్తల సత్తిబాబు, రైతు సంఘం నాయకులు బొర్రా అలమహారాజు, బాలం విజయకుమార్, చేతి వృత్తిదారుల సంఘం నాయకులు యండమూరి సుబ్బారావు, ఆటో కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

యలమంచిలి : స్కీమ్ వర్కర్లకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని ఆశా కార్యకర్తల జిల్లా అధ్యక్షురాలు సిహెచ్.లక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యలమంచిలిలో సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు కె.శ్రీవర్ధిని, దేవ సుధాకర్ ఆధ్వర్యంలో మేడపాడు, యలమంచిలి, దొడ్డిపట్ల పిహెచ్‌సిలకు సంబంధించి కమిటీలను సభ్యుల సమక్షంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ ఈనెల 9న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు సూర్యావతి, రేవతి, కమల, సునీత, కల్పన, బేబీ, సరస్వతి, వరలక్ష్మి, లక్ష్మీకుమారి, రాజేశ్వరి, సుజాత పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలకు అర్హులను గుర్తించాలి : జెసి

ప్రజాశక్తి - అత్తిలి

కొత్తగా ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారిని గుర్తించాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన అత్తిలిలో ఇళ్ల స్థలాల కోసం చేసుకున్న వారి ఇంటికి వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జెసి రెడ్డి మాట్లాడుతూ అత్తిలిలో ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్హులైన వారిని ఏ విధంగా విచారణ చేయాలి, తదితర విషయాలను గ్రామ రెవెన్యూ అధికారులకు సూచించారు. అత్తిలిలో 450 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వారిలో అర్హులైన వారిని గుర్తించాలని ఆదేశించారు. అనంతరం కెఎస్.గట్టుపాలెంలో రేషన్‌షాపును సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతినెలా క్రమం తప్పకుండా వృద్ధులకు, వికలాంగులకు ఇంటికి తీసుకెళ్లి నిత్యావసర సరుకులు అందజేయాలని డీలర్లను ఆదేశించారు. ఆయన వెంట తహశీల్దార్ వంశీ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

3న అల్లూరి త్యాగం.. నేటి యువత కర్తవ్యంపై సెమినార్

హాజరు కానున్న ఎంఎల్‌సి గోపీమూర్తి, గ్రాడ్యుయేట్ పూర్వపు ఎంఎల్‌సి లక్ష్మణరావు

ప్రజాశక్తి - భీమవరం

ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 3వ తేదీన అల్లూరి జయంతిని పురస్కరించుకుని అల్లూరి త్యాగం.. నేటి యువత కర్తవ్యం అంశంపై సెమినార్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బి.గణేష్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గణేష్ మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు 128వ జయంతి సందర్భంగా ఏర్పాటు చేస్తున్న సెమినార్‌ను జయప్రదం చేయాలని కోరారు. ఈ సదస్సుకు ముఖ్య వక్తలుగా కృష్ణ, గుంటూరు గ్రాడ్యుయేట్ పూర్వ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణ్‌రావు, ఉభయగోదావరి జిల్లాల టీచర్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి హాజరుకానున్నారని తెలిపారు. అల్లూరి పోరాట స్ఫూర్తిని నేటి తరం యువత ఆదర్శంగా తీసుకొని కుల మత విభేదాలు లేని, ఆర్థిక అసమానతలు లేని, దోపిడీ లేని సమాజం కోసం పోరాడడమే అల్లూరికి మనమిచ్చే నిజమైన నివాళి అన్నారు. విద్యార్థులు, మేధావులు, విద్యావేత్తలు, ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అత్యాచార కారకులను కఠినంగా శిక్షించాలి

ఐలు ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - తణుకు

కలకత్తాలో న్యాయ విద్యార్థినిపై అత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అనంతరం తహశీల్దార్ అశోక్‌వర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ దేశంలో ఇటీవల కాలంలో మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. వాటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరికట్టాలన్నారు. మెడికల్ విద్యార్థినిపై జరిగిన సంఘటన మరువకముందే మరో ఘటన జరగడం విచారకరమన్నారు. కాలేజీల్లో మహిళలకు పూర్తి రక్షణ కల్పించాలని, దేశంలోని న్యాయవాదుల రక్షణ కోసం సమగ్ర చట్టం చేయాలని మునిస్వామి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు కౌరు వెంకటేశ్వర్లు, కొండా శ్రీనివాసరావు, పి.శ్రీనివాసు, చింతపల్లి నాగేశ్వరరావు, పుల్లేశ్వరరావు, పిట్ట శామ్యూల్, బర్రె విక్టర్‌బాబు, సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా అధ్యక్షులు యార్లగడ్డ రవీంద్ర పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలివ్వాలి

పెన్నాడ అగ్రహారం సచివాలయం వద్ద సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - పాలకోడేరు

ఎన్నో ఏళ్ల నుంచి ప్రభుత్వ స్థలాల్లో నివాసముంటున్న అర్హులందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సిపిఎం మండల కార్యదర్శి శేషాపు అశ్రియ్య డిమాండ్ చేశారు. పెన్నాడ అగ్రహారంలో సచివాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం 30 కుటుంబాలు ఇళ్ల పట్టాల కోసం చేసుకున్న దరఖాస్తులను పంచాయతీ కార్యదర్శి కె.వెంకటరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా అశ్రియ్య మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి ప్రభుత్వ స్థలాల్లో ఎంతోమంది నిరుపేదలు నివాసం ఉంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్న వారికి ఇళ్ల పట్టాలు ఇచ్చే విధంగా జిఒ విడుదల చేసిందని, దీని ఆధారంగా ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

తొమ్మిదో రోజుకు మున్సిపల్ కార్మికుల సమ్మె

తాడేపల్లిగూడెం:సంక్షేమ పథకాలు అమలు చేయాలని, టెక్నికల్, నాన్ టెక్నికల్ కార్మికులకు వేతనాలు పెంచాలని మున్సిపల్ కార్మికుల జెఎసి పిలుపుమేరకు మంగళవారం వరుసగా 9వ రోజు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు మరిపూడి సతీష్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన కోరికలను తీర్చాలని లేకుంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

నరసాపురం: మున్సిపాల్టీలో ఇంజినీరింగ్ విభాగంలో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది చేపట్టిన సమ్మె మంగళవారం తొమ్మిదో రోజుకు చేరింది. ఉద్యోగ భద్రత, కనీస వేతనం రూ.29 వేలు, హెచ్ఆర్‌సి పాలసీ అమలు చేయాలని, రిటైర్డ్ కార్మికులకు గ్రాడ్యూటీ ఇచ్చేలా ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. రత్నం, శ్యామ్, కాశీ, వి.ఫణి, ఎం.సత్యనారాయణ, మధు సుజాత, అను, జి.ప్రసాద్ పాల్గొన్నారు.



నరసాపురంలో సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు

విద్యార్థులకు విద్యామిత్ర కిట్ల పంపిణీ

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని అన్ని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లోని 2,923 మంది విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్స్ పంపిణీ చేసినట్లు ఎంఇఒ-2 ఉంగరాల నాగేశ్వరరావు మంగళవారం ఇక్కడ తెలిపారు. విద్యామిత్ర కిట్‌లో యూనిఫామ్, షూస్, సాక్స్, బెల్ట్, బ్యాగ్, సెమిస్టర్-1 వరకు పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్స్ ఉంటాయని ఆయన అన్నారు. ఉన్నత పాఠశాలల్లో చదివే 6 నుంచి 10 తరగతుల పిల్లలకు నోట్స్ బుక్స్ సైతం ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతీ పాఠశాల పరిధిలో ఎన్‌రోల్మెంట్ డ్రైవ్ ఎక్కడికక్కడ జరుగుతుందని, కొత్త విద్యార్థులను పాఠశాలల్లో చేర్చుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

6న రేబిస్ వ్యాధి నివారణ టీకాలు

గణపవరం : ఈనెల 6వ తేదీన ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా గణపవరం పశువైద్యశాలలో కుక్కలకు రేబిస్ వ్యాధి నివారణ టీకాలు వేయటం జరుగుతుందని గణపవరం పశువైద్య సహాయ సంచాలకులు డిఎం.నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు టీకాలు వేస్తామని చెప్పారు. శునక ప్రేమికులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

టిడిపి రాష్ట్ర యాదవ సాధికారిత కమిటీ డైరెక్టర్ కొండ్రు శ్రీనివాస్

భీమవరం టౌన్ : పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని టిడిపి రాష్ట్ర యాదవ సాధికారిత కమిటీ డైరెక్టర్ కొండ్రు శ్రీనివాస్ అన్నారు. సోమవారం భీమవరం సంస్కార్ స్కూల్లో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించి మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణం కలుషితమవుతోందని, ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలన్నారు. స్కూల్ డైరెక్టర్ నందమూరి నాగ ప్రశాంతి, ప్రిన్సిపల్ అడపా సత్యవతి మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు ప్లాస్టిక్ రహిత సమాజాన్ని అందించడం, పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని అన్నారు. నిర్వాహకులు చెరుకూరి రంగసాయి మాట్లాడారు. ఉపాధ్యాయులు జి.కుమారి, మహాలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

రజక ఆకాంక్ష సభను జయప్రదం చేయండి

భీమవరం టౌన్ : తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో ఈనెల 6వ తేదీన నిర్వహించనున్న రజక ఆకాంక్ష సభను జయప్రదం చేయాలని ఎపి రజక వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పులూరి చంద్రశేఖర్ కోరారు. భీమవరం పట్టణం పేరంటాల చెరువు ఆదిలక్ష్మి రజక సంఘ భవనంలో మంగళవారం పట్టణ రజక నాయకుల సమావేశం నిర్వహించారు. ముందుగా కరపత్రం ఆవిష్కరించి చంద్రశేఖర్ మాట్లాడుతూ రాజమండ్రి నగర రజక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రజక ఆకాంక్ష సభకు ఎపి రజక వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సి.సావిత్రి, సాహాద్యకులరాలిగా కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, పార్లమెంట్ సభ్యులు దగ్గుబాటి పురందేశ్వరి, పాక వెంకట సత్యనారాయణ హాజరవుతున్నారని తెలిపారు. సమావేశంలో ఆల్ ఇండియా ధోబీ మహా సంఘం మీడియా కోఆర్డినేటర్ అమనావు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యాన రోగ నిర్ధారణ పరీక్షలు

పాలకొల్లు : రోటరీ క్లబ్ ఆఫ్ గోదావరి పాలకొల్లు ఆధ్వర్యంలో ఎస్‌సిఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్ సంయుక్తంగా శ్రీదాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి మంగళవారం ఉచితంగా అన్ని రకాల రోగ నిర్ధారణ, రక్తపోటు నమూనా పరీక్షలు నిర్వహించారు. చార్టెడ్ ప్రెసిడెంట్ చేగొండి సూర్యప్రకాష్ మాట్లాడుతూ పోలియో వ్యాధి నిర్మూలనలో రోటరీ క్లబ్ సేవలు చిరస్మరణీయమన్నారు. రోటరీ క్లబ్ తరపున కళాశాలలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ కీర్తి చంద్ నాయుడు, సెక్రటరీ పవన్ నాయుడు, అసిస్టెంట్ గవర్నర్ అప్పారావు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

పాలకొల్లు : స్థానిక ఎపిఎస్ఎస్ఎం ప్రభుత్వ అటానమస్ కళాశాలలో కామర్స్, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, కంప్యూటర్ సైన్స్, కెమిస్ట్రీ, ఫిజికల్ ఎడ్యుకేషన్ సబ్జెక్టులలో అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజారాజేశ్వరి తెలిపారు. సంబంధిత సబ్జెక్టులలో పీజీ డిగ్రీ కలిగి 55 శాతం లేదా ఆపైన మార్కులు కలిగి ఉన్న అభ్యర్థులు, అదనపు అర్హతలు పిహెచ్, బోధన అనుభవం కలిగి ఉన్న అభ్యర్థులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానం ద్వారా బోధించ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడును. అభ్యర్థులు తమ దరఖాస్తులు, సర్టిఫికెట్లను ఈనెల 8 సాయంత్రం వరకు కళాశాల కార్యాలయంలో అందజేయాలని లేదా ఈ క్రింది మెయిల్ ద్వారా తమ దరఖాస్తులను పంపించాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈనెల 9వ తేదీ ఉదయం 10 గంటలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావలెన్నారు.

ఎన్‌టిఆర్ భరోసాతో పేదలకు ఆర్థిక భరోసా

ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ

తణుకు : ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పథకంతో పేదలకు కూటమి ప్రభుత్వం ఆర్థిక భరోసా ఇస్తుందని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని తణుకులోని నాలుగో వార్డులో ఎంఎల్ఎ రాధాకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన ఏడాది కాలం నుంచి ప్రతి నెల ఒకటో తేదీనే దాదాపు 98 శాతం పెన్షన్ల పంపిణీ ప్రక్రియ పూర్తి చేస్తున్నట్లు తెలియజేశారు. తణుకు నియోజకవర్గంలో 35 వేల పెన్షన్లకు సుమారు రూ.150 కోట్లకుపైగా అందజేసినట్లు తెలిపారు. అర్హులైన వారికి ఎందవచ్చినా, వర్షం వచ్చినా అందిస్తున్నట్లు తెలిపారు.

హాస్టల్ విద్యార్థులకు రగ్గుల పంపిణీ

గణపవరం : గణపవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం జగన్నాథపురంలో ఉన్న బాలుర హాస్టల్ విద్యార్థులకు లయన్స్ క్లబ్ పాస్టు గవర్నర్ దామర రంగారావు పుట్టినరోజు సందర్భంగా రగ్గులు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు వెలంకి నరేష్, కార్యదర్శి కిలారి రవిబాబు, కోశాధికారి కెవిఎస్ఎన్.మూర్తి, సభ్యులు ఎన్.ప్రకాష్, పి.రామ్మూర్తి, కెవిఎన్.విశారద పాల్గొన్నారు. అనంతరం డాక్టర్స్ డే సందర్భంగా గణపవరం, నిడమర్రు మండలాల్లో ఉన్న డాక్టర్లను ఘనంగా సన్మానించారు.

ఆర్వో ప్లాంట్ ప్రారంభం

నరసాపురం: బందారు ప్రతాప్ నాయుడు జయంతి వేడుకలు ఆయన కుమారుడు, మాజీ ఎంఎల్ఎ బందారు మాధవ నాయుడు ఆధ్వర్యంలో సరిపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరిపల్లి గ్రామంలో ఆయన జ్ఞాపకార్థం మంగళవారం ప్రతాప్ నాయుడు సోదరుడు బందారు వెంకట స్వామి నాయుడు ఆర్వో ప్లాంట్ ప్రారంభించారు. కార్యక్రమంలో బందారు పటేల్ రాజా నాయుడు, కేదాసు కనకరాజు, దేవరపు నాని, బట్టు నాగేశ్వరరావు, కేదాసు శోభనరావు పాల్గొన్నారు.

సమస్యలను గ్రామసభ దృష్టికి తీసుకురావాలి

సచివాలయ కార్యదర్శి అడ్డాల శ్రీనివాస్

మొగల్తూరు : గ్రామంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గ్రామసభ దృష్టికి తీసుకురావాలని సచివాలయ కార్యదర్శి అడ్డాల శ్రీనివాస్ సూచించారు. మంగళవారం మొగల్తూరు పంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్పంచ్ పడవల మేరీ సత్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధి పనులు, పుంత రోడ్ల తదితర సమస్యలను గ్రామ సభలో ప్రస్తావించాలన్నారు. ఈ సభలో మాజీ జెడ్‌పిటిసి గుబ్బల నాగరాజు, పంచాయతీ కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావు, దేశంశెట్టి శ్రీనివాస్, మెండ రాజేష్ ఉన్నారు.

పాలకొల్లులో స్కూల్ బస్సుల తనిఖీ


పాలకొల్లు : పాలకొల్లు రవాణా శాఖ యూనిట్ అధికారి అజ్మీర బద్దు ఆధ్వర్యంలో స్కూల్ బస్సుల తనిఖీ మంగళవారం నిర్వహించారు. స్కూల్ బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సులు, ఫిట్నెస్, ఫైర్ ఎక్స్టింగ్విషర్స్ వార్, డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్, ఐదు సంవత్సరాల కాల పరిమితి ఉన్న లైసెన్సులు కూడా చెక్ చేశారు. ఇవి లేని వాహనాలకు, డ్రైవర్లకు జరిమానాలు విధించారు. పాఠశాల, కళాశాల బస్సులను అన్ని అనుమతులతో జాగ్రత్తగా నడపాలని ఆదేశించారు ఈ కార్యక్రమంలో డ్రైవర్లకు సూచనలు చేశారు.

నేటి నుంచి సుపరిపాలనలో తొలి అడుగు

పాలకొల్లు : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంలో ఏడాది జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని, విజయాలను, సూపర్ సిక్స్ పథకాల అమలును గడపగడపకు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని రాష్ట్ర జల వనరుల అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు పిలుపునిచ్చారు. ఈనెల రెండో తేదీ నుంచి నెలరోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో టిడిపి శ్రేణులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు, మాజీ ఎంఎల్ఎ అంగర రామ్మోహన్ పాల్గొన్నారు.

తణుకు : బుధవారం అత్తిలి మండలం కె.సముద్రపు గట్టు గ్రామంలో ఉదయం 8 గంటలకు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ఎంఎల్ఎ రాధాకృష్ణ వెల్లడించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలన్నారు.

తల్లి జన్మనిస్తే.. వైద్యుడు పునర్జన్మనిస్తాడు


ఉండి : డాక్టర్లను సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఘనంగా పలుచోట్ల డాక్టర్స్ డే

ప్రజాశక్తి - ఉండి

సమాజంలో వైద్య వృత్తి అతి పవిత్రమైనదని, అమ్మ జన్మనిస్తే.. వైద్యుడు పునర్జన్మనిస్తాడని ఉండి లయన్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ గాదిరాజు రంగరాజు, ట్రెజరర్ పి.జగన్నాథరాజు అన్నారు. మంగళవారం ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులుగా పనిచేసిన డాక్టర్ బి.సాయిచంద్ర, డాక్టర్ పి.లక్ష్మి సునందలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, భారతరత్న డాక్టర్ బిసి.రాయ్ జయంతి, వర్ధంతి సందర్భంగా 1976 నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా 1వ తేదీన డాక్టర్స్ డేను నిర్వహిస్తుందని వారు తెలిపారు. అనంతరం మండల పరిషత్ అధ్యక్షులు ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు మాట్లాడారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి పి.రంగ ప్రసాద్ రాజు, సభ్యులు ఆర్.నరసరాజు, నంబూరి కాశీ విశ్వేశ్వరరావు, సత్తి బ్రహ్మారెడ్డి, భూపతి రాజు హరినాథరాజు, బుద్ధరాజు సుబ్బరాజు, బొండాడ కేశవరావు, కలిదిండి సీతారామరాజు, పాలతీర్థపు నరసింహారావు, ముదునూరి గోపాల రాజు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య విస్తరణ అధికారి ఆర్.కృష్ణ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లు : విద్యార్థులు మానవ శరీరంలో వచ్చే రోగాలు గురించి తెలుసుకోవాలని, తద్వారా సైన్స్‌లో మంచి మార్కులు వస్తాయని సీనియర్ వైద్యులు డాక్టర్ స్వరూప్ చెప్పారు. తనకు విద్యార్థులు జరిపిన సన్మానానికి కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ బిసి రాయ్ జయంతి సందర్భంగా దేశంలో డాక్టర్స్ డేగా పరిగణిస్తారని అన్నారు. ఆయన చేసిన సేవలకు కేంద్ర ప్రభుత్వం 1961లో దేశ అత్యున్నత పురస్కారం భారతరత్నతో సత్కరించారన్నారు. హెచ్ఎం రాయపూడి భవాని ప్రసాద్ పాల్గొన్నారు.

గణపవరం : జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా మంగళవారం పిఎంపి మండల అసోషియేషన్ ఆధ్వర్యంలో పిఎంపి డాక్టర్లు, పిప్పర, గణపవరం పిహెచ్‌సి డాక్టర్లు అయిన కె.ఓంకార్‌నాథ్, శ్రీదివ్యలకు శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోషియేషన్ రాష్ట్ర గౌరవ సలహాదారులు ఎన్.జైసూర్య, జిల్లా అధ్యక్షులు ఎఆర్‌కె.పరమేశ్వర్లు, మండల అధ్యక్షులు ఎం.సత్యనారాయణమూర్తి, కార్యదర్శి శివ శ్రీనివాస్ రావు, కోశాధికారి కోటకల అప్పారావు, మస్తాన్ వల్లి, ఎం.శ్రీను, జి.కృష్ణ, వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

వీరవాసరం : డాక్టర్స్ డే సందర్భంగా వీరవాసరం కళాపరిషత్ అధ్యక్షులు గుండా రామకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక కళ్ల వైద్యురాలు కళ్యాణిని మంగళవారం


పాలకొల్లులో వైద్యుడ్ని సత్కరిస్తున్న చిన్నారులు


గణపవరంలో..


ఆకివీడులో..


పెనుగొండలో..

ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం ఎంపిపి వీరవల్లి దుర్గ భవాని, వైస్ ఎంపిపి అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, టిడిపి మండల అధ్యక్షుడు కొల్లేపర శ్రీనివాసరావు, టిడిపి నాయకులు వీరవెల్లి చంద్రశేఖర్, దాశరధి శ్రీనివాస్, పాలా ఆంజనేయులు, కెవిఎల్, కామిశెట్టి విజయలక్ష్మి, భాజంకి కృష్ణారావు పాల్గొన్నారు.

ఆకివీడు : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక వైద్యులను సన్మానించారు. స్థానిక ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎంవి.సూర్యనారాయణ రాజును ముందుగా సన్మానించి అనంతరం స్థానిక ఐఎంఎ సభ్యులతో ప్రభుత్వ వైద్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అభయా లయన్స్ క్లబ్


తణుకులో..

అధ్యక్షులు గమ్మిడి వీరకుమార్, కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ(పండు), కోశాధికారి చెప్పాలా అనిల్, ఎండి జిక్కి, ఆర్‌వి .సూర్యనారాయణ రాజు పలువురు లయన్స్ సభ్యులు పాల్గొన్నారు. గోల్డెన్ ఆక్వా లయన్స్ క్లబ్ అధ్యక్షులు కనుమూరు ప్రసన్న బంగారురాజు ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యులను సన్మానించారు.

తణుకు : వైద్యులు నిబద్ధతతో సేవలు అందించడం ఎంతో కీలకమైనదని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు, ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్‌అహ్మద్ అన్నారు. స్థానిక సంఘ కార్యాలయంలో సంఘ అధ్యక్షులు అల్లూరి కరుణాకరచౌదరి అధ్యక్షతన డాక్టర్ జె.ప్రభాకరరావు, డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్య, డాక్టర్ ఎం.రాజేందర్, డాక్టర్ హుస్సేన్‌అహ్మద్‌ని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి స్వాలిహా, కోశాధికారి అర్జి భాస్కరరావు, సభ్యులు శనివారపు చలపతిరావు, ఎం.భారతీరాధాకృష్ణ, వి.పార్వతి, ఎన్.కృష్ణానందం, ఆకెళ్ల సుబ్రహ్మణ్యం, అక్కిన బాపినీడు, అక్కిన కాశీ, ఎ.సుబ్బారావు పాల్గొన్నారు.

మొగల్తూరు : డాక్టర్స్ డే వేడుకలను వాసవి వనిత క్లబ్ సభ్యులు మంగళవారం మొగల్తూరులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పిఎంపి వైద్యులు అనంతపల్లి ఫణీంద్ర కుమార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వాసవి వనితా క్లబ్ మొగల్తూరు అధ్యక్షురాలు సీమకుర్తి అరుణ, కార్యదర్శి గుండు లక్ష్మీ కుమారి, కోశాధికారి అనంతపల్లి మంగామణి, అప్పన విజయ, అనంతపల్లి వర్ధని, ఆశాజ్యోతి పాల్గొన్నారు.

కాళ్ల : ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైద్యాధికారులు డాక్టర్ రంగనాయుడు, డాక్టర్ సునీల్‌కు సిబ్బంది పూలమొక్కలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

పెనుగొండ : పెనుగొండ భాష్యం పాఠశాలలో జాతీయ వైద్యుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు వైద్యుల వేషధారణలో అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎన్‌వి.అప్పారావు మాట్లాడారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ కలిదిండి రామచంద్ర రాజు, డాక్టర్ కర్రి భారతి, డాక్టర్ ఎస్‌విడి.పవన్ కుమార్, డాక్టర్ పులగం కృష్ణ కళ్యాణ్‌ని విద్యార్థులు కలిసి వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.


మొగల్తూరులో..

తాగునీటి వనరుల పరిరక్షణకు చర్యలు

విప్, ఎంఎల్ఎ నాయకర్

నరసాపురం : ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని తాగునీటి వనరుల పరిరక్షణకు అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ నాయకర్ హామీ ఇచ్చారు. నరసాపురం పట్టణంలోని శ్రీహరిపేటలో ఉన్న మంచినీళ్ల చెరువును మంగళవారం ఆయన సందర్శించి అక్కడి పలు సమస్యలను సమీక్షించారు. చెరువు పరిసరాల్లో ఏర్పడిన సమస్యలను స్వయంగా పరిశీలించి, వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, నాయకులు వలవల నాని, కొల్లు పెద్దిరాజు, ఆకన చంద్రశేఖర్, గంటా కృష్ణ, అంబటి అరుణ, కొప్పాడ కృష్ణవేణి, తోట అరుణ, భారతి సురేష్ పాల్గొన్నారు.

డాక్టర్ సాయిచంద్ర సేవలు ఎనలేనివి : ఎంపిపి

ఉండి : ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా పనిచేసిన డాక్టర్ బళ్లారి సాయిచంద్ర సేవలు ఎనలేనివని ఉండి మండల పరిషత్ అధ్యక్షులు ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు అన్నారు. ఇటీవల బదిలీలలో భాగంగా అనంతపురం మెడికల్ కాలేజీకి బదిలీ అయిన డాక్టర్ సాయి చంద్ర వీడ్కోలు సభ మంగళవారం ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య విస్తరణ అధికారి ఆర్.కృష్ణకుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీహరి నారాయణరాజు మాట్లాడుతూ ఆరోగ్యపరమైన ఇబ్బందులతో వచ్చిన వారికి మెరుగైన వైద్యం అందిస్తూ అనతికాలంలోనే అందరి మన్ననలు పొందిన వైద్యులు డాక్టర్ సాయి చంద్ర అని కొనియాడారు. కార్యక్రమంలో ఉండి పిహెచ్‌సి సిబ్బంది, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

క్రిమినల్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి : రాజ్యలక్ష్మి

నరసాపురం : ఈనెల 5వ తేదీన నరసాపురం కోర్టు సముదాయంలో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేయదలచిన క్రిమినల్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) ఎస్.రాజ్య లక్ష్మి అన్నారు. స్థానిక కోర్టు హాల్ లో పోలీస్ అధికారులతో న్యాయమూర్తి సమావేశం నిర్వహించారు. ఇప్పటికే ఆయా కోర్టులలో గుర్తించబడిన నరసాపురం టౌన్, రూరల్, యలమంచిలి, మొగల్తూరు పోలీస్ స్టేషన్‌లకు సంబంధించిన క్రిమినల్ కేసులలోని ఇరుపక్షాల వారికి నోటీసులు రూపంలో సమన్వయపరిచి సమన్యాయం జరిగేలా పలు ఎక్కువ కేసులు రాజీ చేయడానికి ప్రయత్నించాలన్నారు. ఈ కార్యక్రమంలో నరసాపురం టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, ఎస్ఐ జయలక్ష్మి, మొగల్తూరు ఎస్ఐ నాగలక్ష్మి, ఎఎస్ఐ సూర్య భాస్కరరావు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు నిధుల సేకరణ అభినందనీయం : ఎంఎల్ఎ

నరసాపురం : సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు, నేరాల నివారణకు సీసీ కెమెరాలు ఎంతో ముఖ్యమైనవని, వాటి ఏర్పాటు కోసం అందరి సహకారంతో నిధులు సమీకరించడం అభినందనీయమని విప్, ఎంఎల్ఎ నాయకర్ అన్నారు. నరసాపురం పట్టణ మున్సిపల్ హాల్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు నిమిత్తం నిధుల సేకరణ కోసం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నాయకర్ మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో పట్టణ అభివృద్ధి దిశగా మరిన్ని చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, డిఎస్‌పి శ్రీవేద, సిఐ యాదగిరి పాల్గొన్నారు.

వికలాంగ సమస్యలను పరిష్కరించాలని వినతి

నరసాపురం: వికలాంగుల సమస్యలను పరిష్కరించాలని మదర్ థెరిస్సా నరసాపురం నియోజకవర్గ వికలాంగ సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ చిక్కాల వాసు అన్నారు. మంగళవారం నరసాపురం జనసేన కార్యాలయంలో మదర్ థెరిస్సా వికలాంగ సంక్షేమ సంఘం తరుపున వికలాంగులు విప్ నాయకర్‌ను కలిసి వినతిని అందజేశారు. 5 లక్షల సబ్సిడీతో కూడిన రుణాలు ఇచ్చి ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. ప్రతి వికలాంగుడికి పెళ్లితో సంబంధం లేకుండా ఆంట్యోదయ రేషన్ కార్డు ఇవ్వాలన్నారు. ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. వికలాంగ పింఛన్ మంజూరుకు పడుతున్న ఇబ్బందుల్ని నియోజకవర్గ సంఘం అధ్యక్షులు చిక్కాల వాసు వివరించారు. వికలాంగులు పింఛన్‌కు పడుతున్న ఇబ్బందుల్ని పరిష్కరించి అందించేలా చర్యలు తీసుకుంటామని ఎంఎల్ఎ నాయకర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బొమ్మిడి అప్పారావు పాల్గొన్నారు.


వినతిని అందజేస్తున్న వికలాంగుడు

రావాడ సతీష్‌కు రోటరీ బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్


రోటరీ జిల్లా అవార్డ్స్ 2024-25 సంవత్సరానికి ప్రకటించారు. పాలకొల్లు రోటరీ క్లబ్ ద్వారా ఈ సంవత్సర కాలంలో చేసిన సేవలను గుర్తించి రావాడ సతీష్‌కు బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డును ముఖ్య అతిథి, రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ వెంకటేశ్వరరావు అందించారు. ఎక్కువ మొత్తంలో పోలియో ఫండ్ ఇవ్వడం, ఎండోమెంట్ ఫండ్, డిస్ట్రిక్ కాన్ఫరెన్స్‌లకి అటెండ్ అవ్వటం, పబ్లిక్ ఇమేజ్, హెల్త్ క్యాంప్స్ పెట్టడం, బేసిక్ ఎడ్యుకేషన్ లిటర్సీ ప్రోగ్రాం, ఎన్విరాన్మెంట్ ప్రోగ్రామ్, కమ్యూనిటీ సర్వీస్ ప్రోగ్రామ్స్ ఇలా అనేక రకాల సేవా కార్యక్రమాలు చేసినందుకు రోటరీ విశిష్ట సేవా పురస్కారం 17వ అవార్డ్ పాలకొల్లు రోటరీ క్లబ్ గెలుచుకుంది. ఈ కార్యక్రమంలో పాలకొల్లు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ రావాడ సతీష్, క్లబ్ సభ్యులు, జవ్వాజి కళ్యాణ్, పోతాబత్తుల సత్యనారాయణ, ముత్యాల శ్రీనివాస్, చందక రాము, మద్దాల వాసు, ఇమ్మేడి రాజేష్, కావలి నగేష్, మద్దాల రాంప్రసాద్, ముచ్చర్ల సంజయ్, కోసూరి ఆనంద రామకృష్ణరాజు, మైగాపుల రాంబాబు, శిరిగినిడి నాగార్జున, కటరీ నాగేంద్ర పాల్గొన్నారు.


అవార్డు అందుకుంటున్న సతీష్

కౌలురైతు కార్డుకు దరఖాస్తు చేసుకోండి

మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు దాసరి వెంకటకృష్ణ

ఉండి : పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ వంటి పథకాలు పొందాలంటే పంట సాగు చేసే కౌలు రైతులందరూ తప్పనిసరిగా కౌలు రైతు కార్డు దరఖాస్తు చేసుకోవాలని వాండ్రం సర్పంచి, మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు దాసరి వెంకటకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని వాండ్రం, కలిగొట్ల, ఆరేడు, ఉండి గ్రామాలలో పంటసాగు హక్కు పత్రాల పంపిణీ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్న దాసరి వెంకటకృష్ణ, మండల తహశీల్దార్ కావడి నాగార్జున, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేవు కార్తీక్, వ్యవసాయ విస్తరణ అధికారి కరణం పరంజ్యోతి మాట్లాడుతూ కౌలు రైతులపైనే వ్యవసాయ రంగం ఆధారపడి ఉందన్నారు. అటువంటి కౌలు రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అన్ని రకాల సంక్షేమ పథకాలు కౌలు రైతులకు అందేందుకు, పంట కొనుగోలు చేసేందుకు ఈ పంట సాగు హక్కు పత్రాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రతి కౌలు రైతు కార్డుకు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమాలలో వాండ్రం మాజీ ఉపసర్పంచి సిహెచ్.లక్ష్మీనారాయణ, టిడిపి నాయకులు కునుకు శ్రీనివాస్, వాండ్రం గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, గ్రామ రెవెన్యూ అధికారులు ఎస్.చిన్నారావు, మేరీ, గ్రామ వ్యవసాయ సహాయకులు లావణ్య, ఆల్ ఫ్రైడ్, రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.


కౌలు రైతు కార్డులు పంపిణీ చేస్తున్న దాసరి వెంకటకృష్ణ

కోళ్లపర్రులో ఆర్‌డిఒ పరిశీలన

ఆకివీడు : తమ భూమిని 22ఎ చట్టం పరిధిలోకి తీసుకొచ్చారని, ఆ చట్టాన్ని వెంటనే తొలగించాలని కోళ్లపర్రు గ్రామానికి చెందిన రైతులు బండారు వెంకట సత్యనారాయణ, బండారు వెంకట సూర్యనారాయణ ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. ఆ భూమిని ఆర్‌డిఒ ప్రవీణ్ కుమార్ రెడ్డి స్థానిక తహశీల్దార్ నండూరి వెంకటేశ్వరరావుతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ భూమిపై అధికారులు చెప్తున్న కథనం ప్రకారం కోళ్లపర్రు గ్రామంలో రీ సర్వే నెంబర్ 471/2, 471/3 లలో పంటకాలువకు చెందిన నాలుగెకరాల 75 సెంట్లు ప్రభుత్వ పోరంబోకు భూమి ఉంది. ఈ భూమిని రైతులు ఇరువురు వరిసాగు చేసుకుంటున్నారు. 2016వ సంవత్సరంలో ఈ భూమి పోరంబోకు భూమి అని, ఈ భూమిని ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నారని అక్కడివారు కొందరు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు విఆర్‌ఒ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. ఆ భూమిని 22ఎ చట్టంగా ప్రభుత్వం ప్రకటించింది. కోర్టులో ఈ కేసు నడుస్తోంది. ఈ అంశంపై విచారణకు, పరిశీలనకు ఆర్‌డిఒ ప్రవీణ్‌కుమార్ రెడ్డి ఇక్కడికి వచ్చారు. పరిశీలన అనంతరం నివేదికను జాయింట్ కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు.